సాక్షి మంచిర్యాల

సోమవారం ၊ 8 ၊ సెప్టెంబర్ ၊ 2025



నిబంధనలు సరే.. అమలేది?

గ్రామాల్లో పాలిథిన్ కవర్ల నిషేధం అమలు కావడం లేదు. అధికారుల ఆదేశాల మేరకు కొన్ని రోజుల పాటు నిషేధం పాటించిన వ్యాపారులు తిరిగి వాటి వాడకాన్ని ప్రారంభించారు. 9లో▸



ముస్లింల శాంతియుత ర్యాలీ

మిలాద్ ఉన్‌నబీని పురస్కరించుకొని ఆదివారం జిల్లాలోని వివిధ గ్రామాల్లో ముస్లింలు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /25.0

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. పలుచోట్ల తేలికపాటి వర్షాలు పడుతాయి.

న్యూస్‌రీల్

గూడెంలో పౌర్ణమి జాతర



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు

దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన దండేపల్లి మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం బాద్రపద పౌర్ణమి జాతర ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. 33 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు.

వంతెన నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు



చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రజలు

నెన్నెల: మండలంలోని గంగారం పెద్ద చెరువు మత్తడి వాగుపై వంతెన నిర్మాణానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ రూ.3 కోట్ల 15 లక్షల ఐటీడీఏ నిధులను మంజూరు చేశారు. ఆదివారం గంగారం, చిన్నవెంకటాపూర్, కొత్తూర్ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో దశాబ్దాల కల సాకారం కానుందని, ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణంతో రవాణా సౌకర్యాలు మెరుగుపడి తమ కష్టాలు తీరనున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ గంగారాం గ్రామశాఖ అధ్యక్షుడు జాడి రాజ్‌కుమార్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీరాముల దేవేందర్, తిరుమలేష్, బిస్మయ్య, జలీల్,స్వామి, రెడ్డి, కస్తూరి పోశం, అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూలో మెరిసిన శ్రీకృతి



సిల్వర్ మెడల్‌తో చిన్నారి శ్రీకృతి

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణానికి చెందిన పెండ్యాల శ్రీకృతి కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా విద్యతో పాటు మార్షల్ ఆర్ట్స్‌లో రాణిస్తున్న శ్రీకృతిని పలువురు అభినందించారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



మాట్లాడుతున్న సదానందంగౌడ్

మంచిర్యాలఅర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం మంచిర్యాలలో రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూటీఎస్) జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, పెన్షనర్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. ఉపాధ్యాయుల హక్కుల సాధనకు ఎస్టీయూ టీఎస్ నిరంతరం కృషి చేస్తోందన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక

అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా భట్టారి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా ఒడిగే కృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా కరుణాకర్, ఉపాధ్యక్షులుగా సత్తయ్య, బాపు, వీ.పద్మ, కార్యదర్శులుగా మన్మోహన్, కే.మహాలక్ష్మి, పి.సత్యనారాయణ, ఆర్థిక కార్యదర్శిగా సుమన్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నింటి తిరుపతిరావు వ్యవహరించారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ పొందిన బీసగోని శంకర్‌గౌడ్, లింగయ్య, సుజాత నర్సయ్య, పదోన్నతి పొందిన దామోదర్, వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా పూర్వ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

హెపటైటిస్‌కు చెక్



హెపటైటిస్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి సుధాకర్ నాయక్ (ఫైల్)

హెపటైటిస్ వ్యాక్సిన్ వేసుకోనున్న వారు

మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి	528
మాతా శిశు ఆరోగ్య కేంద్రం	263
సీహెచ్‌సీలు (లక్సెట్టిపేట, బెల్లంపల్లి, చెన్నూర్)	280
మెడికల్, నర్సింగ్ కాలేజీ విద్యార్థులు	519
మొత్తం	1,590

- ఈ నెల 9, 10, 11 తేదీల్లో వైద్యులు, సిబ్బందికి వ్యాక్సిన్
- మూడు డోసులుగా టీకా అందించేందుకు ప్రణాళిక
- 2030 నాటికి వైరస్‌ను అంతం చేయడమే ప్రభుత్వాల లక్ష్యం

మంచిర్యాలటౌన్: అత్యంత ప్రమాకరమైన హెపటైటిస్ వ్యాధి నియంత్రణ, నివారణ చర్యలపై వైద్యారోగ్య శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. '2030 నాటికి కాలేయాన్ని కాపాడుదాం–హెపటైటిస్‌ను ఓడిద్దాం' అనే నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకెళ్తున్నాయి. ఇందులో భాగంగానే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది జూలై నుంచి జాతీయ వైరల్ హెపటైటిస్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. హెపటైటిస్ అనేది కాలేయం (లివర్)కు సంబంధించి ఉండే వాపు. ఇది వివిధ రకాల వైరస్‌ల వల్ల ఏర్పడుతుంది. ముఖ్యంగా దీనిపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం వల్ల వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య క్రమేపి పెరుగుతోంది. ఇది సోకిన వారికి వైద్యం అందించే వైద్యులు, సిబ్బంది, ఆస్పత్రుల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు వైరస్ సోకే ప్రమాదం ఉండడంతో ఆరోగ్య సిబ్బందికి వ్యాక్సిన్‌ను వేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి.

ఆరోగ్య సిబ్బందికి వ్యాక్సిన్

హెపటైటిస్ వ్యాధి నియంత్రణకు ముందుగా హైరిస్క్ వర్గాలైన వైద్యులు, వైద్య సిబ్బంది, ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వ్యాక్సిన్ వేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగానే ఈ నెల 9వ తేదీన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, 10, 11 తేదీల్లో బెల్లంపల్లి, చెన్నూర్, లక్సెట్టిపేట్‌లోని సామాజిక ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బందికి, ప్రభుత్వ మెడికల్ కాలేజీలోని ప్రొఫెసర్లు, మొత్తం సిబ్బందితో పాటు, ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థులు, నర్సింగ్ చదివే విద్యార్థులందరికీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెపటైటిస్ వ్యాక్సిన్ వేయనున్నారు. మొత్తంగా మూడు డోసులుగా ఈ వ్యాక్సిన్ వేయనున్నట్లు వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ముందస్తుగా ఈ నెల 9, 10, 11 తేదీల్లో మొదటి డోసు వేసుకున్న వారికి నెల రోజుల తర్వాత రెండవ డోసు, ఆరవ నెలలో మూడో డోసు వేయనున్నారు. అనంతరం ఐదేళ్ల తర్వాత బూస్టర్ డోస్ వేయనున్నారు.

ప్రమాదకరమైన వైరస్

ఒకసారి హెపటైటిస్ వైరస్ శరీరంలోకి ప్రవేశిస్తే శరీరంలో దాని సంఖ్య లక్షల్లో పెరిగి లివర్‌ను దెబ్బతీయడం ఆరంభిస్తుంది. ఈ వైరస్ శరీర ద్రవాల ద్వారా వ్యాపిస్తుండగా, రక్తమార్పిడి, సూదులు, సిరంజిలు తల్లి నుంచి బిడ్డకు సంక్రమించవచ్చు. పరీక్షల్లో హెచ్‌బీఎస్‌ఏజీ పాజిటివ్‌గా ఉండటమే కాకుండా హెచ్‌బీఈఏజీ కూడా పాజిటివ్‌గా ఉండి ఎస్‌జీపీటీ (కాలేయానికి సంబంధించిన ఎంజైమ్) ఉండాల్సిన దానికంటే ఎక్కువ ఉండి వైరల్ లోడ్ 5 లక్షల కంటే ఎక్కువ ఉందంటే వీరికి భవిష్యత్‌లో ఎప్పుడో ఒకప్పుడు లివర్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధిని నివారించేందుకు ముందుగానే మందులు తీసుకోవడం ముఖ్యమని, వైరస్ సన్నిహితులకు సంక్రమించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ వ్యాధి సోకిన వారు ఆల్కహాల్ తీసుకోవద్దని, తరచూ వైద్యుల పర్యవేక్షణ అవసరమని వైద్యులు పేర్కొంటున్నారు. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని, టూత్ బ్రష్‌లు, రేజర్లు, నెయిల్‌కట్టర్లు, సెలూన్లలో ఒకరికి వాడిన బ్లేడ్‌లను ఇతరులు వాడకుండా జాగ్రత్తలను తీసుకోవడం, పచ్చబొట్లు వేయించుకునే వారు, చెవులు, ముక్కులు కుట్టటం వంటి పరికరాలు ఒకరికి వాడిన వాటిని మరొకరు వాడకుండా చూసుకోవాలి. రక్తమార్పిడి, సురక్షితం కాని శృంగారం, తల్లి నుంచి బిడ్డకు హెపటైటిస్ సోకే అవకాశం ఉంది. దీని నివారణకు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం, సురక్షిత నీరు, ఆహారం తీసుకోవాలని, హెపటైటిస్ వ్యాక్సిన్‌ను వేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వైద్యులు, సిబ్బందికి వ్యాక్సిన్



ఈ నెల 9, 10, 11 తేదీల్లో వైద్యులు, సిబ్బందికి ముందస్తుగా హెపటైటిస్ వ్యాక్సిన్ వేయనున్నాం. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని సూపరింటెండెంట్‌తో పాటు, ప్రొఫెసర్లు, వైద్యులు, సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బందికి, బెల్లంపల్లి, చెన్నూర్, లక్సెట్టిపేట్ సీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది, ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులకు వ్యాక్సిన్ వేయనున్నాం. ఆతర్వాత పీహెచ్‌సీలతో పాటు ఇతర ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యసిబ్బందికి, ఆతర్వాత జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ప్రోగ్రాం ఆఫీసర్లు, ఇతర సిబ్బంది, డీఎంహెచ్‌వోలకు వ్యాక్సిన్ వేయడం జరుగుతుంది.

– డాక్టర్ అనిత, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో

సింగరేణి క్రీడలకు వేళాయె..

- ఈ నెల 10 నుంచి ఏరియా వార్షిక పోటీలు ప్రారంభం
- శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో ఏర్పాట్లు



పోటీలు నిర్వహించనున్న ప్రగతి మైదానం

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా డబ్ల్యూపీఎస్, జీఏ 2025–26 వార్షిక క్రీడా షెడ్యూల్‌ను యాజమాన్యం ప్రకటించింది. ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ఈ క్రీడాపోటీలు ఈ నెల 10 నుంచి శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో ప్రారంభం కానున్నాయి. ఇందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశారు. ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్లను కలిపి మొత్తం నాలుగు గ్రూప్‌లుగా చేశారు. ఈ గ్రూపుల మధ్య పోటీలు నిర్వహించనున్నారు. ఏరియా స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను కంపెనీ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. అక్కడ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జాతీయ స్థాయిలో జరిగే కోలిండియా పోటీలకు ఎంపిక చేస్తారు.

ప్రగతి మైదానంలోనే పోటీలు

ఈ ఏడాది కూడా క్రీడా పోటీలన్నీ ప్రగతి మైదానంలో నిర్వహించనున్నారు. 10న వాలీబాల్, 11న బాస్కెట్‌బాల్, 12న బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఉంటాయి. ఇందులో ప్రతీ గ్రూప్ నుంచి 8 మంది క్రీడాకారులు జట్టులో ఉంటారు. 13, 14 తేదీల్లో అథ్లెటిక్స్ (మెన్, ఉమెన్), త్రోబాల్ (ఉమెన్), స్విమ్మింగ్ (మెన్), 14న బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, 15న ఫుట్‌బాల్, 16న హాకీ పోటీలు ఉంటాయి. ఇందులో ప్రతీ జట్టులో 14 మంది క్రీడాకారులు ఉంటారు. 17న లాన్‌టెన్నిస్, 18న కబడ్డీ, 20, 21న క్రికెట్, 21న చెస్, క్యారమ్స్ పోటీలు, 26న కల్చరల్ పోటీలు నిర్వహించనున్నారు. స్విమ్మింగ్ పోటీలు సీసీసీలోని సింగరేణి స్విమ్మింగ్ పూల్‌లో జరుగనున్నాయి.

స్పోర్ట్స్ మెటీరియల్ కొరత..

సింగరేణి వార్షిక క్రీడల షెడ్యూల్ విడుదలైనప్పటికీ ఇప్పటి వరకు క్రీడా సామగ్రి, కీడ్రాకారులకు దుస్తులు రాలేదు. గడిచిన మూడేళ్ల నుంచి ఇవి సరఫరా కావడంలేదు. దీంతో వాలీబాల్స్, ఫుట్‌బాల్స్, హాకీ స్టిక్స్, నెట్స్, తదితర క్రీడాసామగ్రి కొరత తీవ్రంగా ఉంది. క్రీడాకారులకు అందించే క్రీడాదుస్తులు, షూస్ కూడా సమకూర్చకుండానే పోటీలు నిర్వహించడానికి సిద్ధం కావడంతో క్రీడాకారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ రానురాను క్రీడలను తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని క్రీడాకారులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే మెటీరియల్ కొరతపై అధికారులను సంప్రదించగా కొనుగోలు పూర్తి అయ్యిందని, ఒకటి రెండు రోజుల్లో క్రీడా సామగ్రి, దుస్తులు రాబోతున్నాయని తెలిపారు.

గ్రూపులు ఇవే..

ఎస్సార్పీ గ్రూప్ : ఎస్సార్పీ 1, ఎస్సార్పీ 3, 3ఏ
ఆర్కే I గ్రూప్ : ఆర్కే 6, ఐకే 1ఏ
ఆర్కే II గ్రూప్ : ఆర్కే 7, ఆర్కే న్యూటెక్
అదర్స్ గ్రూప్ : ఎస్సార్పీ ఓసీపీ, ఐకే ఓసీపీ, ఎస్టీపీపీ, ఇతర డిపార్టుమెంట్లు



మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గోదావరి తీర ప్రాంతాలు, ఎల్లంపల్లి శ్రీపాదసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ పర్యాటకులను కనువిందు చేస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీరు, శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్ట్‌ల నుంచి వచ్చిన వరద నీటితో ఎల్లంపల్లి జలాశయం నిండుకుండలా మారి జలకళను సంతరించుకుంది. ఈ క్రమంలో ఇటు గోదావరి, అటు ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ అంతా కూడా వీచే గాలులతో సముద్రపు అలల్లా ఎగిసిపడుతున్నాయి. సముద్రాల్లో అలల మాదిరి సవ్వడి చేస్తూ ఆహ్లాదం పంచుతూ ఆకట్టుకుంటున్నాయి. రాపల్లి గ్రామ శివారులో గోదావరి తీరాన కనిపించిన ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– మంచిర్యాలరూరల్(హాజీపూర్)

కాంగ్రెస్‌లో కానుకల చర్చ

- చెన్నూర్‌కు చెందిన 46 మందికి దసరా కానుక
- మాకెప్పుడిస్తారని ప్రశ్నిస్తున్న మిగతా కార్యకర్తలు

చెన్నూర్: చెన్నూర్ కాంగ్రెస్ కార్యకర్తల్లో దసరా కానుకల చర్చ మొదలైంది. పట్టణానికి చెందిన 46 మంది కాంగ్రెస్ కార్యకర్తలకు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఒక్కొక్కరికి దసరా కానుకగా రూ.20 వేల చొప్పున గుట్టుచప్పుడు కాకుండా ఇచ్చినట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో సొంత పార్టీలోనే కానుకల లొల్లి చర్చనీయాంశంగా మారింది.

కార్యకర్తలకు అండగా..

స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన చెన్నూర్ పట్టణానికి చెందిన 46 మంది కార్యకర్తలకు అండగా ఉండాలనే ఉద్దేశంతోనే కానుకలు ఇచ్చినట్లు పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు.

మేమేం పాపం చేశాం

చెన్నూర్‌లో మంత్రి దసరా కానుకలు ఇవ్వడంతో కొందరు సొంత పార్టీ నాయకులే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం విశేషం. కాంగ్రెస్ పార్టీలో 46 మందే ఉన్నారా? నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలు లేరా? మాకేందుకు ఇవ్వరు దసరా కానుకలు? అని కాంగ్రెస్ పార్టీ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టులు కోడైకూస్తున్నాయి. మేమేం పాపం చేశామని చర్చించుకుంటున్నారు. తాము సైతం ఎన్నికల్లో పని చేశామని, మమ్మల్ని ఎందుకు గుర్తించలేదని నిరుత్సాహం చెందినట్లు తెలిసింది. మరో విడత ఇస్తారనే ఆశతో ఉన్నట్లు తెలిసింది.

చెన్నూర్‌తోనే ఆపేస్తారా?

కానుకల విషయం వెలుగులోకి రావడంతో చెన్నూర్‌తోనే ఆపేస్తారా? కార్యకర్తలందరికీ ఇస్తారా? అని పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు చర్చించుకుంటున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టిక్కెట్లు ఇస్తామని, లేక ఇతర లబ్ధి చేకూరుస్తానని కార్యకర్తలకు భరోసా ఇస్తారా? అని కార్యకర్తలు గుసగుసలాడుతున్నారు. ఏదిఏమైనప్పటికీ కాంగ్రెస్‌లో కానుల చర్చ హాట్‌టాపిక్‌గా మారింది.



ఆశలపై ఇసుక మేటలు

ఇటీవల కురిసిన వర్షాలు రైతుల ఆశలపై నీళ్లు చల్లాయి. వేమనపల్లి మండలంలోని రాజారాం గోదుంపేట శివారులో నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువకు గండ్లుపడి పక్కనే ఉన్న పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. వరిపైరు ఇసుకలో కూరుకుపోయి నామరూపాలు లేకుండా పోయింది. – వేమనపల్లి

హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

పాతమంచిర్యాల: బేవరేజస్ హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని హరిత ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ బేవరేజస్ వర్కర్స్ యూనియన్ 4వ రాష్ట్ర మహాసభ నిర్వహించారు. అంతకుముందు పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. సభ ప్రాంగణం వద్ద సీఐటీయూ జెండా ఎగురవేసి అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా బేవరేజస్ కార్పొరేషన్‌లో 2 వేల మంది హమాలీ కార్మికులు పని చేస్తున్నారని, బేవరేజ్‌ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.40 వేల కోట్ల ఆదాయం సమకూరుతోందన్నారు. ఆదాయం ఉన్నప్పటికీ ప్రభుత్వం ప్రైవేట్ గోదాములలోనే సరుకు నిల్వ చేస్తున్నారన్నారు. అందులో సరైన వసతులు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వంగూరు రాములు మాట్లాడుతూ హమాలీ కార్మికులకు పనికి తగిన వేతనం, పనిస్థలాల్లో భద్రత లేదన్నారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. అధిక బరువులు మోయడం వల్ల యుక్త వయస్సులోనే రోగాల బారిన పడతున్నారని, వారికి ఆదరణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు గోమాస ప్రకాష్, దాసరి రాజేశ్వరి, నాయకులు చల్లూరి దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెకు చేరిన సాంకేతికత

- సాగుకు టెక్నాలజీ దన్ను
- అన్నదాత చెంతకు ఆధునిక యంత్రాలు

జన్నారం: వ్యవసాయరంగంలో కూలీల కొరత ఏర్పడుతుండడంతో రైతులు యాంత్రీకరణ, ఆధునిక యంత్రాలవైపు దృష్టి సారిస్తున్నారు. రోజురోజుకు సాగు భారంగా మారడంతో అరకలకు స్వస్తి చెప్పి ట్రాక్టర్లు, వీడర్లు, డ్రోన్లు, తైవాన్ బ్యాటరీ స్ప్రేయర్లు, కలుపుతీత యంత్రాల కొనుగోలు వైపు రైతులు అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయంలో యంత్రాల సహాయం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఎడ్లు, నాగళ్లు పోయి ట్రాక్టర్లు వచ్చాయి. పొలం చదును చేసింది మొదలు, నాటువేసి, పొలం కోసేంత వరకు రైతులు యంత్రాలనే ఉపయోగిస్తున్నారు. కొడవళ్లతో పొలం కోసి, కుప్పలు పెట్టి, తూర్పార పట్టే రోజులు పోయాయి. హార్వెస్టర్ ద్వారా పొలాన్ని కోయించడంతో గంటల వ్యవధిలోనే వరిధాన్యం ఇంటికి చేరుతోంది. ప్రభుత్వం జిల్లాల వారీగా విజ్ఞాన కేంద్రాల ఏర్పాటుకు తీసుకున్న నిర్ణయంతో రైతులకు మరింత దన్ను లభించనుంది. ప్రభుత్వం యంత్ర పరికరాలకు రాయితీ కల్పిస్తే రైతుల్లో మరింత భరోసా పెరగనుంది.

పెరుగుతున్న యంత్రసాయం

వ్యవసాయరంగంలో రోజురోజుకూ సమూల మార్పులు వస్తున్నాయి. మంచిర్యాల జిల్లాలో ఎక్కువశాతం మంది రైతులు అత్యధికంగా పత్తి, వరి పంటను సాగు చేస్తున్నారు. జిల్లాలో 1,48,962 ఎకరాల్లో వరి, 1,60,987 ఎకరాల్లో పత్తి, 255 ఎకరాల్లో మొక్కజొన్న, 921 ఎకరాల్లో కందులు, 165 ఎకరాల్లో పెసర్లు పంటలు సాగు చేస్తున్నారు. మారుతున్న కాలంతో పాటు వ్యవసాయంలో కూలీల కొరత ఏర్పడుతుండడంతో రైతులు యంత్ర సహాయం తీసుకుంటున్నారు.

కలియదున్నడానికి వీడర్లు

పంటల్లో దున్నడం, జంబు కొట్టేందుకు అరకలు వాడేవారు. పశుపోషణ భారంగా మారడంతో రైతులు వీడర్లు కొనుగోలు చేస్తున్నారు. వివిధ రకాల యంత్రాలను వ్యవసాయానికి వాడుతున్నారు. వీడర్‌లో ఒక లీటర్ పెట్రోల్ తో ఎకరం భూమిని దున్నవచ్చు. దుక్కిదున్నితే లోపల మట్టి బయటకు, బయట మట్టి లోపలికి వెళ్లి భూమి సారవంతం అవుతుంది. ఇలా చేయడం వల్ల ఎరువులు భూమిలో కలిసిపోయి పంటలకు పోషకాలు అందుతాయి.

డ్రోన్‌తో పిచికారీ

పంటలను ఆశించిన చీడపీడలను నివారించేందుకు స్ప్రేయర్లతో పిచికారీ చేయడం పాత పద్ధతి. ఇప్పుడు పంటలకు రసాయనాలు పిచికారీ చేసేందుకు డ్రోన్‌లు వచ్చేశాయి. డ్రోన్ ద్వారా రోజుకు 30 నుంచి 40 ఎకరాల వరకు పురుగుల మందు పిచికారీ చేయవచ్చని రైతులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా రైతులకు తక్కువ సమయంలోనే ఎక్కువ విస్తీర్ణంలో మందులు పిచికారీ చేయవచ్చు. కూలీలకు శ్రమ కూడా తగ్గుతుంది. 12 లీటర్ల సామర్థ్యం గల డ్రోన్ అరగంటకు ఎకరం విస్తీర్ణంలో మందులు పిచికారీ చేస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు. డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేయడం వల్ల సమయం, ఖర్చు ఆదా అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. దీంతో పాటు పంట చేలల్లో పాములు, తేళ్ల బారినుంచి రక్షణ పొందవచ్చు. ఒక డ్రోన్ రూ.5 లక్షల వరకు లభిస్తోంది. దీనిని ప్రభుత్వం రాయితీపై అందజేస్తే రైతులకు ప్రయోజనం కలగనుంది.

సౌర కంచెలు

పంటలను అడవి పందులు, కోతులు ఇతర జంతువుల భారి నుంచి కాపాడుకోవడానికి చాలామంది రైతులు సౌర పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. బ్యాటరీ సహాయంతో పొలం చుట్టూ కంచెలను ఏర్పాటు చేస్తున్నారు. జంతువులు, ప్రజలకు ఎలాంటి హాని లేకుండా పంటలను కాపాడుకోవచ్చు.



డ్రోన్‌ను ఆసక్తిగా చూస్తున్న గ్రామస్తులు

ఉపాధి లభిస్తోంది



డ్రోన్ వినియోగం గురించి జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీలో వారం రోజులు శిక్షణ ఇచ్చారు. నెల రోజుల క్రితం రూ.5 లక్షలు వెచ్చించి డ్రోన్, నాలుగు బ్యాటరీలు తీసుకున్నా. 12 లీటర్ల సామర్థ్యం గల ఈ డ్రోన్ పిచికారి యంత్రంతో ఒక్కసారి ఎకరం పొలానికి మందు పిచికారీ చేయవచ్చు. ఎకరాకు రూ.500 చొప్పు తీసుకుంటున్నా. పరిసర ప్రాంతాల రైతులు మందు పిచికారీ కోసం వస్తుండడంతో ఉపాధి లభిస్తోంది. – చిట్యాల నరేశ్, కలమడుగు

రైతుకు ప్రోత్సాహం

రైతులకు వ్యవసాయం కోసం ప్రభుత్వం వివిధ రీతుల్లో ప్రోత్సాహం అందిస్తుంది. ఇప్పటికే సబ్సిడీపై యంత్రాలను అందించే యోచనలో ప్రభుత్వం ఉంది. నారుమడి దున్నడం నుంచి నాటు వేసే వరకు యంత్రాల వాడకం గురించి రైతులకు వివరిస్తున్నాం. మండలంలో మొదటిసారి డ్రోన్‌తో మందులు పిచికారీ చేస్తున్నారు. రైతులకు యంత్ర సాయం కోసం ప్రభుత్వం సహకరిస్తుంది. – సంగీత, ఏవో, జన్నారం

క్లుప్తంగా

అంబులెన్స్‌లో ప్రసవం



జన్మనిచ్చిన ఆడపిల్లతో తల్లి

ఇచ్చోడ: బజార్‌హత్నూర్ మండలం సోనేరావు గూడ గ్రామానికి చెందిన జయమాల అనే గర్భిణి అంబులెన్స్‌లో ప్రసవించింది. ఆదివారం ఆమెకు పురిటినొప్పులు రావడంతో భర్త చరణ్‌దాస్ అంబులెన్స్ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని ఆమెను ఇచ్చోడ పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికమయ్యాయి. అంబులెన్స్‌ను రోడ్డు పక్కన నిలిపి ఈఎంటీ శశికాంత్ ఆమెకు ప్రసవం చేయగా ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను ఇచ్చోడ పీహెచ్‌సీకి తరలించారు. ఈఎంటీ శశికాంత్, పైలెట్ జైసింగ్‌లకు మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

క్షుద్రపూజల కలకలం

కెరమెరి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో క్షుద్రపూజల కలకలం రేపింది. గత కొంత కాలంగా పలు ప్రాంతాల్లో కుంకుమ, అగరొత్తులు, నిమ్మకాయలతో పూజలు చేసినట్లు ఆనవాళ్లు కనిపించాయి. తాజాగా శనివారం రాత్రి ఓ ఇంటి ఎదుట నిమ్మకాయ, గుడ్డు ఉండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎవరికి హానీ చేయాలని ఇలా చేస్తున్నారు? లేదా గుప్తనిధుల కోసం ఇలా చేస్తున్నారో తెలియడం లేదని అంటున్నారు.

ఎడ్యుకేషన్ లోన్ పేరిట మోసం

మందమర్రిరూరల్: ఎడ్యుకేషన్ లోన్ పేరిట యువకుడు మోసపోయిన ఘటన మందమర్రిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. మూడవ జోన్‌కు చెందిన యువకుడు ఆన్‌లైన్‌లోని ఓ వెబ్‌సైట్‌లో రూ.50 వేల ఎడ్యుకేషన్ లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఆ వెబ్‌సైట్ నుంచి యువకుడి వివరాల సేకరణలో భాగంగా లోన్ ఆమోదం అయిందని నమ్మించి అతని ఆధార్, పాన్‌కార్డు, వ్యక్తిగత వివరాలు, ఖర్చులకు రూ.37,500 చెల్లించాలని చెప్పారు. డబ్బులు చెల్లించిన తర్వాత లోన్ రాకపోయేసరికి మోసపోయానని గ్రహించాడు. వెంటనే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫిర్యాదు చేయగా ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుకు యువరైతు మృతి



చిక్రం లింగు (ఫైల్)

నేరడిగొండ: అడవి పందుల బారి నుంచి పంట కాపాడుకునేందుకు కాపలా వెళ్లిన యువ రైతు పాముకాటుకు గురై మృతి చెందాడు. మండలంలోని గాజిలి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అనసూయ–వెంకట్ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గ్రామంలో పదెకరాల వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రెండో కుమారుడు యువ రైతు చిక్రం లింగు (20) బుధవారం రాత్రి వారి పంట కాపలా కోసం అక్కడికి వెళ్లాడు. గురువారం ఉదయం ఇంటికి రాకపోయేసరికి కుటుంబీకులు వెళ్లి చూడగా లింగు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానిక వైద్యుడికి చూపించగా, మెరుగైన వైద్యం కోసం 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. శనివారం రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఆదిలాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తి..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆదిలాబాద్ టౌన్: పట్టణంలోని తిర్పెల్లి సమీపంలో గల రైల్వేస్టేషన్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. రైల్వే సిబ్బంది సమాచారం ఇవ్వడంతో ఆదివారం సంఘటన స్థలానికి చేరుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్ల వరకు ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు చెప్పారు. ఎవరైన మృతదేహాన్ని గుర్తుపడితే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

గ్రహణం ఎఫెక్ట్.. ఆలయాలు మూసివేత

'గూడెం' వద్ద..



దండేపల్లి: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు దండేపల్లి మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ప్రధాన ఆలయంతోపాటు, అనుబంధ ఆలయాలను మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తుల దర్శనాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు.



మూసివేసిన శ్రీ లక్ష్మీ నారాయణస్వామి ఆలయం

జైనథ్‌లో

జైనథ్: మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి ఆదివారం ఉదయం 10:30 గంటలకు మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం 4:00 గంటలకు తెరవనున్నారు. గ్రహ సంప్రోక్షణ, అనంతరం స్వామివారికి హారతి కార్యక్రమం తర్వాత 6 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం ఉంటుందని ఈవో చంద్రశేఖర్ తెలిపారు.

మూసివేసిన కాల్వ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రధాన ద్వారం



దిలావర్‌పూర్‌లో..

దిలావర్‌పూర్: మండలంలోని ప్రధాన ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. స్థానిక ఏకనాథుని, రేణుక ఎల్లమ్మ, నవాంజనేయ, శ్రీమాతా న్నపూర్ణ పాపహరేశ్వర, కాల్వ పరిసర అటవీ ప్రాంతంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాలను అర్చకులు మూసివేశారు. సోమవారం సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కలుగజేస్తామని ఆలయ వర్గాలు వెల్లడించాయి.

కొలిక్కి వచ్చినట్లేనా..

- చెన్నూర్ ఎస్బీఐ కేసులో పురోగతి
- 19 కిలోల బంగారు ఆభరణాలు రికవరీ?
- రెండురోజుల్లో పూర్తి రికవరీకి అవకాశం
- కోర్టు ద్వారా బ్యాంక్‌కు అప్పగించనున్న పోలీసులు



చెన్నూర్ ఎస్బీఐ

చెన్నూర్: చెన్నూర్ ఎస్బీఐ–2 బ్రాంచిలో కుంభకోణం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 20 కిలోల బంగారు ఆభరణాలు, రూ.1.10 కోట్ల నగదు కోంభకోణ కేసును పక్షం రోజుల్లో రామగుండం సీపీ నేతృత్వంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చెన్నూర్ సీఐ దేవేందర్‌రావు 90 శాతం పురోగతి సాధించినట్లు తెలిసింది. పోలీసులు సుమారు 19 కిలోల బంగారు ఆభరణాలు రికవరీ చేసినట్లు తెలిసింది. ఈనెల 3 నుంచి 6 తేదీ వరకు గణేశ్ నిమజ్జనంలో పోలీసు అధికారులు బిజీబిజీగా ఉన్నారు. సోమవారం పనిదినాలు కావడంతో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో బంగారు అభరణాలు రికవరీ చేసే అవకాశం ఉందని సమాచారం.

రికవరీ బంగారం కోర్టు ద్వారానే..

పోలీసులు పూర్తిస్థాయిలో రికవరీ చేసిన బంగారు ఆభరణాలను కోర్టులో అప్పగిస్తారని తెలిసింది. బ్యాంక్ లీగల్ అడ్వయిజర్ బ్యాంక్‌లో మాయమైన ఆభరణాల వివరాలను కోర్టుకు అప్పగించి స్వాధీనం చేసుకుంటారని సమాచారం. ఇదంతా పక్షం రోజులు పడుతుందని తెలిసింది. కోర్టు ద్వారా బ్యాంక్ స్వాధీనం చేసుకున్న తర్వాత బాధితుల వారీగా నగలు పరిశీలించాల్సి ఉంటుంది. 20 కిలోల బంగారు ఆభరణాలు కావడంతో 402 మంది బాధితులకు సంబంధించినవి వేరు చేయాలంటే రెండు నెలలు పట్టే అవకాశం ఉందని బ్యాంక్ అధికారులు అంటున్నారు.

నేడు బ్యాంక్ ఎదుట ఆందోళన?

ఎస్బీఐలో గోల్డ్ రికవరీ అయిన తర్వాత ఆభరణాలు ఎప్పుడిస్తారనే అనుమానం బాధితులను వెంటాడుతుంది. పూర్తిస్థాయిలో అధికారులు తమకు ఎప్పుడిస్తారనే సమాచారం లేక సోమవారం బ్యాంక్ ఎదుట ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామని పలువురు బాధితులు చర్చించుకుంటున్నట్లు తెలిసింది.



దిగువకు వెళ్తున్న నీరు

కడెం ప్రాజెక్ట్ గేటు ఎత్తివేత

కడెం ప్రాజెక్ట్ గరిష్ట నీటిమట్టానికి చేరుకుంది. ఆదివారం ఉదయం ప్రాజెక్ట్‌కు 4402 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండడంతో ఒక వరద గేటు ఎత్తి 4,053 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 699.450 అడుగులుగా ఉంది. – కడెం



నిండుకుండలా 'ఎల్లంపల్లి'

ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టులతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరదతో ఎల్లంపల్లి జలాశయం నిండుకుండలా మారింది. ఆదివారం ప్రాజెక్ట్ నీటిమట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్‌కు గాను 147.58 మీటర్లకు 148, 20.175 టీఎంసీలకు గాను 20.175 టీఎంసీలతో ఉంది. ఇన్‌ఫ్లో కింద 1,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా అవుట్ ఫ్లో కింద హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 315 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. 2 గేట్లు తెరిచి 1,185 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిపెడుతున్నారు. – మంచిర్యాలరూరల్(హాజీపూర్)

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

- 16 తులాల బంగారు ఆభరణాలు అప్పగింత

లక్ష్మణచాంద: పోగొట్టుకున్న ఆభరణాలు, నగదును బాధితురాలికి అప్పగించి ఆటోడ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి..కడెం మండల కేంద్రానికి చెందిన కొంక సుజాత ఖానాపూర్‌లో ఆరోగ్యమిత్రగా విధులు నిర్వహిస్తోంది. ఆమె కుమార్తె వివాహానికి 16 తులాల బంగారు ఆభరణాలు నిర్మల్‌లో చేయించింది. శనివారం కుమారుడితో కలిసి బంగారు ఆభరణాలు తీసుకుని బైక్ పక్కన బ్యాగులో ఉంచి మధ్యాహ్నం కడెంకు బయల్దేరారు. ఈక్రమంలో బ్యాగు ఎక్కడో పడిపోయింది. ఈ విషయమై సోషల్ మీడియాలో పోస్టు చేశారు. లక్ష్మణచాంద మండలం రాచాపూర్‌కు చెందిన ఆటోడ్రైవర్ తక్కల సాయికుమార్ నిర్మల్ నుంచి లక్ష్మణచాంద వెళ్తున్నాడు. నిర్మల్‌రూరల్ మండలం కొండాపూర్ ఫ్లై ఓవర్ సమీపంలో 61వ జాతీయ రహదారిపై బ్యాగు పడి ఉండడాన్ని గమనించి ఇంటికి తీసుకెళ్లాడు. సోషల్ మీడియాలో చూసిన సాయికుమార్ ఆదివారం బాధితురాలి వివరాలు తెలుసుకున్నాడు. రాచాపూర్‌లో 16 తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును ఆమెకు అందించారు. బ్యాగు అందించి నిజాయితీ చాటిన సాయికుమార్‌ను సుజాత కుటుంబ సభ్యులు, పలువురు అభినందించారు.



సుజాతకు బంగారు ఆభరణాలు అందిస్తున్న ఆటోడ్రైవర్ సాయికుమార్

డ్రగ్స్ ముఠా వెనుక కాంగ్రెస్ హస్తం

- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: డ్రగ్స్ ముఠా వెనుక కాంగ్రెస్ నాయకుల హస్తం ఉండటంతోనే చూసీచూడనట్లు వదిలేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని చర్లపల్లిలో రూ.12వేల కోట్ల విలువైన డ్రగ్స్ ఓ కంపెనీలో పట్టుబడటం దారుణమని, దీనికి బాధ్యత వహిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ మండలం కోసినిలోని ఆయన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహారాష్ట్ర పోలీసులు నెల రోజుల పాటు కాపుకాసి అన్ని ఆధారాలతో దాడులు చేసి డ్రగ్స్ పట్టుకున్నారని, తెలంగాణ పోలీస్ వ్యవస్థ పూర్తిగా విఫలమైందన్నారు. డ్రగ్స్ మొక్క ఎక్కడ ఉన్నా గద్దలా పీకేస్తామని, దీని కోసం ఈగల్ అనే ఈ కొత్త డిపార్ట్‌మెంట్ ప్రారంభిస్తామని చెప్పిన సీఎం చర్లపల్లిలో డ్రగ్స్ ఎందుకు పట్టుకోలేదని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఎస్పీఎం కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలి

సిర్పూర్ పేపరుమిల్లులో కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇటీవల మిల్లు ప్రమాదంలో ఎన్నం భాస్కర్ అనే కాంట్రాక్టు కార్మికుడు గాయపడిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. మిల్లు నుంచి వచ్చే విషవాయువులతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు శ్యాంరావు, కొంగ సత్యనారాయణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న హిందుత్వ వాదులు, ఛత్రపతి శివాజీ అభిమానులు, కాంగ్రెస్ నేతలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలో శనివారం వినాయక నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావుపై అసత్య ఆరోపణలు చేసిన మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుపై చర్యలు తీసుకోవాలని హిందుత్వవాదులు, ఛత్రపతి శివాజీ అభిమానులు, కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం మాట్లాడారు. గణేశ్ నిమజ్జనాన్ని హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించగా, వేదికపైకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అసత్యపు మాటలతో రాజకీయ వేదికగా మార్చి, విద్వేషాలతో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యేతోపాటు అనుచరులపై మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఎస్జీఎఫ్ క్రీడలు విజయవంతం చేయండి

ఇచ్చోడ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా త్వరలో నిర్వహించే ఎస్జీఎఫ్ క్రీడలను విజయవంతం చేయాలని ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ఆడే రామేశ్వర్ కోరారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో క్రీడాజట్ల ఎంపిక పోటీల నిర్వహణపై చర్చించారు. 43 క్రీడాంశాల్లో 14, 17 ఏళ్ల విభాగం బాలుర, బాలికల జోనల్ వేదికలు ఖరారు చేసినట్లు తెలిపారు. జట్ల ఎంపికను పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయ, క్రీడా సంఘాలు, పీడీ, పీఈటీలు, సహకారంతో పోటీలు విజయవంతం చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల ఎస్జీఎఫ్ కార్యదర్శులు ఎండీ యాకుబ్, రవీందర్ గౌడ్, వెంకటేశ్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా వ్యాయమ విద్యా ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.పార్థసారథి, బుక్యా రమేశ్, కె.భోజన్న, సాయికుమార్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆడే రామేశ్వర్

మూడు ఆలయాల్లో చోరీ



అగ్గిమల్లన్న ఆలయంలో హుండీని పగులగొట్టిన దొంగలు

ఖానాపూర్: పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంతోపాటు తర్లపాడ్‌లోని ఓంకారేశ్వర, అగ్గిమల్లన్న ఆలయాల్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో 6 సీసీ కెమెరాలు, డీవీఆర్, 4 గ్రాముల పుస్తెలు, ఓంకారేశ్వర ఆలయంలో సీసీ కెమెరాతోపాటు హుండీలో నగదు, కానుకలు, అగ్గిమల్లన్న ఆలయంలో హుండీని పగులగొట్టి నగదు, కానుకలను దొంగలు ఎత్తుకెళ్లారు. పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన సూదం శ్రీనివాస్ బైక్‌ను దొంగిలించారు. ఆలయకమిటీ సభ్యుల ఫిర్యాదులపై కేసులు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

జైపూర్: సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. ఇందారం ఐకే–ఓసీపీలో ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్ అలీతో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. తాము గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడే కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత, వైద్య సౌకర్యం, మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. ఆ తర్వాత వచ్చిన గుర్తింపు సంఘాలు కనీసం వారిని పట్టించుకోలేదన్నారు. తాము తిరిగి మళ్లీ గుర్తింపు సంఘంగా గెలిచిన వెంటనే పర్మినెంట్ కార్మికులకు మాదిరిగా వారికి లాభాల్లో వాటాగా రూ.5 వేలు ఇప్పించినట్లు తెలిపారు. హైపవర్ కమిటీ వేతనాలు, చట్టబద్ధమైన లీవు, సిక్, జాతీయ పండుగల సెలవులు ఇవ్వాలని సంస్థను కోరినట్లుగా తెలిపారు. అనంతరం ఓపెన్‌కాస్టులో పని చేస్తున్న కార్మికులు ఏఐటీయూసీలో చేరగా వారిని యూనియన్‌లోకి ఆహ్వానించారు.



కండువా కప్పుతున్న సీతారామయ్య

పాపికొండలను తలపిస్తున్న 'కడెం'

- హైకోర్టు జడ్జి సృజన

కడెం: కడెం ప్రాజెక్ట్ అందాలు బాగున్నాయని, పాపికొండలను తలపిస్తుందని హైకోర్టు జడ్జి సృజన అన్నారు. శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో కడెం వచ్చారు. బృందావన్ రిసార్ట్స్‌లో విడిది అనంతరం ఆదివారం ఉదయం కడెం ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఆయకట్టు, వరద గేట్లు, నీటిమట్టం తదితర వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మిషన్ భగీరథ ఇంటెక్‌వెల్‌ను పరిశీలించారు. ప్రాజెక్ట్‌లో కుటుంబ సభ్యులతో కలిసి బోటింగ్ చేశారు. ఆమె వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి, ఆర్ఐ శారద, రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.



బోటింగ్ చేస్తున్న సృజన, కుటుంబీకులు

బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

రెబ్బెన: రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్–14 బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలకు సుమారు 30 మంది బాలికలు, 20 మంది బాలుర హాజరయ్యారు. అనంతరం క్రీడాకారులకు పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఈనెల 13 నుంచి 14 వరకు జనగామ జిల్లా కూనురులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు నరేశ్ పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

ఎంపికైన క్రీడాకారులు

ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ బాలిక జట్టుకు ఎం.సహాస్ర, టి.ప్రజ్వలశ్రీ, పి.శ్రావ్య,ఎస్.సాయిశ్రీ వర్షిణి, డి.వేరోనికా, జి.హన్నా, పి.సిరి, బి.రాజేశ్వరి, పి.పవిత్ర, ఎండీ అల్వీన, ఎస్.రిషిత, డి.నందిని, ఎస్.విజయస్ఫూర్తి, ఎండీ జేబా, బాలుర జట్టుకు వరుణ్, నిఖిల్, ఎం.కృష్ణ లోకనందు, సీహెచ్ అఖిల్, బి.రాఘవ, బి.ఆంజనేయులు, కె.స్టీఫెన్, జె.అశ్విన్, ఎం.తిరుపతి, సీహెచ్ అరవింద్, డి.విష్ణు వర్ధన్, ఎం.త్రిచూర్ కృష్ణ ఎంపికయ్యారు.

సెపక్‌తక్రా ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక

రెబ్బెన: మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆదివారం సెపక్‌తక్రా ఉమ్మడి జిల్లా సీనియర్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైనవారు ఈనెల 20 నుంచి 22 వరకు మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో పాలిటెక్నిక్ కళాశాలలో జరగబోయే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని అసోషియేషన్ ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కుమ్మరి మల్లేశ్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, క్రీడాకారులు నరేశ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు..

సెపక్‌తక్రా ఉమ్మడి జిల్లా సీనియర్ పురుషుల జట్టుకు ఆడే రాజేందర్, ఆర్.వెంకటేశ్, చందు, రాజశేఖర్, రాందాస్, మహిళల జట్టుకు టి.అనూష, కె.స్ఫూర్తి కారుణ్య, జె.నేహశ్రీ, అభినవ రమ్య, కె.శ్రీవల్లి ఎంపికయ్యారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.నారాయణరెడ్డి, సెపక్‌తక్రా అసోషియేషన్ సంయుక్త కార్యదర్శి శిరీష, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె.భాస్కర్, ఆర్.రామకృష్ణ, జి.శ్రీధర్, పి.సాంబయ్య అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులు

ఎదురెదురుగా ఢీకొన్న రెండు కార్లు

ముధోల్: మండలంలోని తరోడా గ్రామం వద్ద ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై బిట్లాపెర్సిస్ కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం నీల గ్రామానికి చెందిన బలరాం, వర్ని మండలానికి చెందిన అనసూయ ఆదివారం భైంసా నుంచి నిజామాబాద్‌కు కారులో వెళ్తున్నారు. నిజామాబాద్ నుంచి భైంసాకు నవ్యశ్రీ, అనురాధ కారులో వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. బలరాం, అనుసూయలకు తీవ్రగాయలై ఇద్దరి కాళ్లు విరిగాయి. నవ్యశ్రీ, అనురాధలకు స్వల్పగాయాలయ్యాయి. ఘటన స్థలానికి ఎస్సై చేరుకుని క్షతగాత్రులను భైంసా ఏరియాస్పత్రికి తరలించారు.